

# కల్ప వృక్షం

రచన: గీత

నాల్గు రోజుల నుండి కుండపోతగా వర్షం కురుస్తోంది. గాలి వానకు చాలా చెట్లు, టెలిఫోన్ స్తంభాలు ఆవీ పడిపోయాయి. ఊళ్ళో రెండ్రోజుల బట్టి కరెంటు లేదు. సముద్రం పోటు ఎక్కువగా ఉంది. కొళ్ళాయి గొట్టాలు పోయి నీళ్ళు లేవు. ఎండ ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు ప్రజలు. ఎండ కోసం వాచి పోయి వున్నారు. కాలేజీలు, స్కూళ్ళు మూసేసారు బస్సులు తిరగటం మానేసాయి, ఊరంతా నిర్మానుష్యంగా ఉంది. మరో రెండ్రోజులకుగాని ఈ వర్షం తగ్గదని ఆకాశవాణి కేంద్రాలు చెపుతున్నాయి,

వర్షం మూలంగా నాలుగు రోజుల బట్టి కాలేజీకి శెలవు లిచ్చారు. అంచేత విద్యార్థుల ఎలక్షన్లు మరో పది రోజులకు

వాయిదా వేసారు. విద్యార్థులు రంగులతో గోడల మీద రాసిన స్లోగాన్లు, ఓటు వేయ మని రాసిన అభ్యర్థనలు నీళ్ళధార య్యాయి. వాచ్‌మెన్ కూడా రెండు రోజుల బట్టి రావడం మానేసాడు. కాలే జీకి ఎదురుగుండా ఓ చింత చెట్టు వుంది. అదే ప్రస్తుతం కాలేజీకి కాపలా కాస్తుంది దాని మీద పక్షులు లేవు. అవి వానవల్ల ఎక్కడికో ఎగిరి వెళ్ళిపోయాయి. చెట్టు క్రింద రోజూ నిలబడే అబ్బాయిలు లేరు. ఆ చెట్టుకు ముద్దుపేరు కల్పవృక్షం! దానికి వయసు సుమారు నూరు సంవత్సరాలు దాటింది.

* * *

'వెధవ్వాన' అనుకుంది చింతచెట్టు! నేను పుట్టి పెరిగిన ఇన్నాళ్ళలోను ఇంత పెద్ద గాలివాన ఎరగను. ఏమిటి చెప్మా వేళ్ళు లాగేస్తున్నాయి. ముసలిదాన్నయి పోతున్నాను. వెధవ గాలి కొమ్మలు ఊపేస్తుంది. నొప్పిగా వుంది. పాపం! కుర్రాళ్ళు వెర్రినాగమ్మలు. ఎంత కష్టపడి రాసుకున్నారో గోడలనిండా! అంతా వానకి చెరిగిపోయింది. నేను పుట్టి ఎన్నా ళ్ళయింది చెప్మా? నూరు దాటిందను కొంటాను. అప్పటికి ఇంకా కాలేజి లేదు, హైస్కూలు ఒక్కటే వుంది, హైస్కూలు కుర్రాళ్లు కోతికొమ్మచ్చలు ఆడుకోవడానికి వచ్చేవారు. అప్పుడు ఎంత దృఢంగా వుండేదాన్ని!

అల్లూరి సీతారామరాజుని కాల్చిచంపా రుట! అలాంటి కుర్రాడిని ఇన్నాళ్ళ జీవి తంలోను మరొకడిని చూడలేదు! శర్ర బాణం పట్టుకొచ్చి గురి చూపి కాయలు కొట్టేవాడు. చెట్టుక్రింద కూర్చుని భోం చేద్దాం రండర్రా అని తక్కిన కుర్రాళ్ళను పిల్చుకొచ్చేవాడు.

ఎంత చలాకీగా వుండేవాడు రాజు! మల్లయ్య అనుకొంటాను. చాలా లావుగా ఉండేవాడు, కుర్రాళ్ళందరిలోను చాలా పెద్దవాడు. వాణ్ని చూసి మాట్లాళ్ళేక భయ పడేవారట, రోజూ తన కన్న చిన్న పిల్లల దగ్గర పెన్సిళ్ళు, పుస్తకాలు, డబ్బులు జెల్లలు కొట్టి తీసికొనేవాడు. రాజు కుర్రాళ్ళందరినీ చేరదీసి మల్లయ్యను నాకు తోడుగాకట్టి మరింకెప్పుడు అలాంటి పని చెయ్యకుండా పెళ్ళి చేసాడు. 'బల వంతమైన సర్పము చలి చీమల చేత చిక్కి చావదె సుమతీ' అనేవాడు. తెల్ల వాళ్ళను పిల్లిలా చేసిన తెలుగు పులి. పోలీసు స్టేషనులో దోపిడి చేస్తూ వచ్చి ఇన్‌స్పెక్టర్ కుర్చీలో కూర్చుని ఉత్తరం రాసేడు ఎంత ధైర్యం! సీతారామరాజుని మర్చిపోయారు ఇప్పటి కుర్రాళ్ళు.

పి. వి. రామన్‌ని రోజూ చూస్తుండే దాన్ని. ఏం తెలివయిన వాడు-ఇలాగే ఫిజిక్స్‌లాబ్‌కు వెళుతూ వుండేవాడు. రోజూ రాత్రి నా దగ్గిర నిలబడి ఊరికే ఆకాశం ప్రక్క నక్షత్రాల ప్రక్క చూసే వాడు. పగలు నా నీడని కూర్చుని ఏవో లెక్కలు చేసేవాడు. నోబుల్ ప్రైజ్

ఇచ్చార్డ. ఇండియాలో నోబుల్ ప్రైజ్ పుచ్చుకున్న వాళ్ళలో రెండవవాడు.

ఈ వెధవ్వాన ఇంక తగ్గదు కాబోలు! ఈ మధ్య శ్రీశ్రీ వచ్చాట్ట యూనివర్శిటీకి. కాలేజీలో చెట్టు కులాసాగా వుందా అని అడిగేట్ట. నా నీడనే ఫుట్ బాల్ ఆడేవాడు కదూ, నాతో మాట్లాడడమే ఓ ఎడ్యుకేషన్ అంటూ కన్యాశుల్కంలోని గిరీశాన్ని ఇమిటేట్ చేస్తూ గంటల తరబడి లెక్చర్లు యిచ్చేవాడు. సిగరెట్టు యిస్తే గేయం చెప్తాననేవాడు. మహాప్రపంచం అంటూ అప్పట్నుంచీ కలలు గంటూ వుండేవాడు. ఎన్ని గేయాలు విన్నాను శ్రీశ్రీవి. ఎంత పొంగిపోయానో నా గురించి శ్రీశ్రీ అడిగేడని తెలియగానే. శ్రీశ్రీయైనా నన్ను గుర్తుంచుకొన్నాడు. ఎంతవాడయ్యాడు? మద్రాసులో ఏం అవస్థలు పడుతున్నాడో. ఈ మధ్య సన్మానం చేసారు స్టేడియంలో: తెన్నేటి విశ్వనాధం అధ్యక్షత వహించాడు. నాకే వడక వస్తే ఎంత బావుణ్ను. స్టేడియం దౌనులో ఉండటం చేత సరిపోయింది. లేకపోతే ఆ మాత్రం చూడలేకపోయే దానిని. ఎగిరెగిరి చూసాను. ఆ విశ్వనాధం ప్రస్తుత యం. పి. విశ్వనాథం అప్పుడప్పుడు కాలేజీకి వస్తుంటాడు. ఓల్డు బాయ్స్ డేకి తప్పక వస్తాడు. వీళ్ళందరినీ తలుచుకొంటూ ఉంటే ఎంత గర్వంగా ఉంటుంది!

పై కొమ్మ విరిగిపోయింది. అబ్బ! నొప్పి. ఇవాళ ఇలా చిత్రవధతో ఛస్తే కాబోలు! రేపు నేను లేకపోతే కుర్రాళ్ళు ఎలా వుంటారో!

పదేళ్ళయింది కాబోలు హైస్కూలు శత సంవత్సర వార్షికోత్సవం జరిగి.చాల పెద్ద ఎత్తున ఉత్సవాలు జరిగేయి. నా నీడనే కదూ జరిగేయి. చాలా కొమ్మల విరిచేసారు. ఎంతో బాధపడ్డాను. గౌడగులా తయారు చేసారు. రంగు రంగుల బల్బులు నాకు హారాల్లా కట్టారు. క్రింద చీమల పుట్టలూ అవీ లేకుండా చేసారు కాళ్ళ దగ్గిర పారాణి రాసినట్టు ఎర్రటి రంగు వేసారు. అంతకాలం పాతకాలం దానిలా వున్న నన్ను up to date కాలేజీ అమ్మాయిలా చేసారు. కల్ప వృక్షం అంటారు నన్ను, నా పేరే మర్చి పోయాను. కవి సమ్మేళనం జరిగింది ఆఖరి రోజున. విశ్వనాధం నా ఎదురుగ కవితా గోష్టిలో పాల్గొన్నప్పుడు ఎంత ఆనందంగా పొంగిపోయానో. వీళ్ళందరి గురించి వింటున్నప్పుడు ఎంతో ఆనందంగా వుంటుంది.

వారం రోజులయింది. కుర్రాళ్ళు నా దగ్గిరికి వచ్చి కాలేజీ ఎప్పుడు తెరుస్తారో ఈ వెధవ్వాన ఎప్పుడు పోతుందో! శ్రీరంగం రాజేశ్వర రావు కాబోలు నా గురించి ఏదో కథలో రాసాట్ట. పాపం వెలుగులోకి వస్తున్నవాడు చిన్నప్పుడే చీకట్లో కలిసిపోయాడు.

నా దగ్గరికి కుర్రాళ్ళు వస్తే ఎందుకో

కోపం అందరికి వాళ్ళ మీద. క్లాసు రెగ్గొట్టి చెట్లక్రింద వున్నారని కోపం. క్లాసులో పాపం కూర్చోలేకనే కదా నా దగ్గరికి వస్తున్నారు, వాళ్ళకు అర్థం అయ్యేలా పాఠాలు చెపుతే నా దగ్గిరకు ఎందుకు వస్తారు. క్లాసులో ఏం చెపుతున్నదీ అర్థం కాకపోయినా కూర్చుని తెలీని ప్రశ్నలకు జవాబులు అడిగి, చెప్పలేని మాష్టర్ల చేత తిట్లు తిని, మరీ రెచ్చగొడితే వాళ్ళని తన్ని ఏడిపిస్తే బావుండు కాబోలు. అయినా క్లాసులో కన్న ఎక్కువ మంది విద్యార్థులు నా దగ్గర ఉంటటం చేత జలసీ కాబోలు మాష్టర్లకి, ప్రిన్సిపాల్‌కి! అ మాష్టర్లు కూడా ఒకప్పుడు ఈ కాలేజీలో చదివి నా నీడని బ్రతికిన వాళ్ళే వెధవ చెట్టు కొట్టించేస్తా' అన్నాట్ట ప్రిన్సిపాల్ ఆ మధ్య. చెట్టు కొట్టడానికి వీలులేదు. తల్లిలాంటిది. కొడితే స్ట్రయికు చేస్తాం అన్నారు విద్యార్థులు నాలో ఏం చూసో వాళ్ళకింత అభిమానం వాళ్ళ నన్నాదుకో పోతే ముక్కలు క్రింద నరికేవారు.

ఈ విద్యార్థుల దగ్గి నుంచి ఎంత జ్ఞానం సంపాదిం ను. కాని మూగజీవిని. నాకే మనుషుల మాట్లాడే భాష మాట్లాడ గలిగితేనా కాలేజిలో జరుగుతున్న పాపాలు బైట పెట్టేదానిని అమాయకులైన పిల్లలను జైలుకు పంపారు ఆ మధ్య. హిందీ వద్దన్నా స్టీలు ప్లాంటు కావాలన్నా, రెగ్యులేషన్సు మార్చవద్దన్నా ఏ గొడవ వచ్చినా కాలేజీలో పర్మిచరు బద్దలు కొట్టారుగాని ఒక్కళ్ళూ నా మీద చెయ్యి వెయ్యలేదు. ఈ మధ్య కుర్రాళ్ళు ఎక్కువగా రావటం లేదు వచ్చిన వాళ్ళు అ నీడన నిలబడి అమ్మాయిల మీద రాళ్ళు. రాకెట్లు విసురుతున్నారు చెట్టు క్రింద మనుషులంటే రికి అంచేతే కోపం కాబోలు. కుర్రాళ్లు పాపం. తప్పర్రా. అని చెప్పాలని ఉంటుంది. ఎన్ని లక్షల మంది అబ్బాయిలు ఇక్కడ చదివి, నా నీడని ఉండి డాక్టర్లు, ఇంజనీర్లు. ఇంకా ఎంత పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారో పాపం ఈ మధ్య ఉద్యోగాలు దొరకడం లేదట. ఉద్యోగానికి లంచాలు ఇవ్వాలట నా నీడని బ్రదికిన వాళ్లు గొప్ప వాళ్ళయితే సంతోషంగా ఉంటుంది. ఉద్యోగాలు లేక ఆకలితో మాడుస్తూ ఉంటే చాలా బాధగా వుంటుంది. ప్రకృతే యిలా భయపెస్తూ పీడిస్తూ ఉంది మనిషి మరొకడిని పీడిస్తున్నాడు.

అమ్మ బాబోయ్ కొమ్మలన్ని ఎగిరిపోతున్నాయి అబ్బా వేళ్ళు తేలిపోతున్నాయి. పెద్దగాలి అమ్మో . చచ్చిపోతున్నాను కూలి పోతాను కాబోలు. నోరు పిడటంలేదు అరుపు వినబట్టం లేదు .అమ్మో ము ఎవరూ లేరు రక్షించడానికి . అబ్బా .కూలి పోయాను .. నడుం విరిగిపోయింది . రెండ్రోజుల్లో ఎండి పూర్తిగా చచ్చిపోతాను.

* * *

చెట్టు కూలిందన్న వార్త తుఫానుగాలి కన్న వేగంగా ఊరంతా వ్యాపించింది. వానలోనే తడుస్తూ ఆఖరిసారి చెట్టును చూడ్డానికి వస్తున్నారు విద్యార్థులు, ఊరిలోని జనం. ఎంతో మంది కళ్ళంట నీళ్లు పెట్టుకున్నారు హమ్మయ్య అనుకున్నారు ప్రిన్సిపాలు. మాష్టర్లు.

రెండ్రోజులికి వాన పూర్తిగా పోయి ఎండ వచ్చేసింది, ఎండని ఓ నాలుగు రోజుల్లో చెట్టు ఎండి పోయింది. చెట్టు దగ్గిరకి ఎవరూ రావడం మానేసారు. తల చెడిన స్త్రీలా ఉంది బోడిగా అక్కడ. హాస్టల్ మెస్‌లోకి చెట్టుకొట్టించి రవాణా చేసాడు వార్డెను.

అన్నం గంగాళం క్రిందపంచ ఖాతాలోకి కలిసిపోతోంది చెటు కాలి పోతూ కూడా తన పిల్లల్లాంటి విద్యార్థులకు వంట చెరుకుగా ఉపయోగ పడటంతో చాలా ఆనందంతో మండి పోతోంది.

• • •

(పై చెట్టు విశాఖపట్నం మిసెస్ ఎ.వి.ఎన్ కళాశాలలో ఉండేది ఈ మధ్యనే కూలిపోయింది.) •

---

క ళ్ళ జో డు

ఒక పత్రికలో ప్రకటన

మొన్న విజయవాడ—గుంటూరు బస్‌లో కళ్ళజోడు పడిపోయింది. దొరికిన వారు ఈ పత్రికలోనే కాస్త పెద్ద టైపులో ప్రకటించ ప్రార్థన

★

డాక్టరు కొత్తగా కళ్ళజోడు పెట్టుకున్నాక ఎలా ఉంది?

రోగి ఘోరంసార్! యీ రోడ్లపైద ఇన్ని బస్లేమిటి అదంతా కనిపిస్తూ ఉంటే రోడ్డు దాటట మెలాగో తెలియక మతిపోతోంది.

★

భారత దేశంలోని ఇద్దరు పుణ్య దంపతులకు మొదటి సారిగా ఇద్దరు-కవల మగ పిల్లలు కలిగారట. వాళ్ళకి పీటర్ రిపీటర్ అని పేరు పెట్టేరు. మళ్ళీ సారి ఇద్దరు కవల పిల్లలు. వాళ్ళని కేటూ డూప్లికేటూ అన్నారు.

ముచ్చటైన మూడోసారి కాన్పులలో కూడా కవలలే. ఈసారి వాళ్ళని మేక్స్—క్లయిమేక్స్ అన్నారు